ప్రజాశక్తి

ఆదివారం 21 జనవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంగన్‌వాడీలకు విశాల మద్దతు

అనకాపల్లిలో మానవహారం చేపట్టిన నాయకులు, అంగన్‌వాడీలు

విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టిన కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

- ఎక్కడికక్కడ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకోలు, ప్రదర్శనలు
- సమస్యలు పరిష్కరించాల్సిందే : నాయకులు

(వార్తలు 8లో..)

వైసిపి ఖాళీ అవుతోందా ?

దక్షిణంలో వాసుపల్లితో మిగిలింది ఒక్క కార్పొరేటరే

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని వైసిపి నాయకత్వ తీరుపై సొంత పార్టీ వారే అసమ్మతితో రగిలి పోతున్నారు. పలు తరగతులకు చెందిన ప్రజల్లో వైసిపి పాలనపై కనిపించే వ్యతిరేకత ఒక ఎత్తయితే స్థానిక నాయకత్వ తీరుతో ముఖ్య నాయకులు, ఆ పార్టీ జెండాను ఏళ్లతరబడి భుజాన ఎత్తుకున్న వారు సైతం నెమ్మదిగా వైసిపిని వీడుతుండడం తాజా పరిణామం. అసలు విశాఖ నగరానికి బలమంతా కార్పొరేటర్లే. 98 వార్డుల్లో 58 వరకూ వైసిపి చేతిలోనే ఉన్నాయి. 2019 ఎన్నికల్లో విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తరం, దక్షిణం స్థానాలు నాలుగూ టిడిపి గెలిచినవే. దీంట్లో దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వైసిపి తీర్థం పుచ్చుకున్నప్పటికీ మిగతా 2లో..

సమావేశానికి హాజరైన కొద్ది మంది నేతలతో వాసుపల్లి

ఎయు విసిగా ప్రసాదరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి శనివారం ఉదయం వీసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో సారి ఆయనను వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎయు పరిపాలనా భవనం వద్ద రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మొక్కను అందించి ప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు, ఆచార్యుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం ప్రసాద్‌రెడ్డి ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్‌లతో కలిసి పుష్పాంజలి అర్పించారు. అనంతరం కార్యాయలంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మిగతా 2లో..

పని ప్రదేశాల్లో

మహిళలకు అండగా నిలవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పని ప్రదేశాల్లో మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని, ఆహ్లాదకర, స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. మహిళలను కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలని, వారి హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనే భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదని హితవు పలికారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం - 2013పై స్థానిక జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ఆయన మాట్లాడుతూ చట్టం తాలూక ఉద్దేశాలను, మహిళలకు కల్పించిన రక్షణ చర్యలను వివరించారు. చట్టం గురించి అధికారులందరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని, పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఆయా కార్యాలయాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలపై వేధింపుల నిరోధక చట్టం గురించి విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. మాటల ద్వారాగానీ, చేష్టల ద్వారాగానీ, ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ మహిళలపై వేధింపు చర్యలకు పాల్పడరాదని, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వైసిపి ఖాళీ అవుతోందా ?

మూడు ఇప్పటికీ టిడిపి ఖాతాలోనే ఉన్నాయి. కార్పొరేటర్ల ఎన్నికలకు వచ్చేసరికి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు భిన్నంగా అధిక స్థానాలు వైసిపికి దక్కాయి. 2024 అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ మరలా పాత పరిణామాలే పునరావృత్తమవుతున్నాయి. అందులో అసమ్మతి తీవ్రరూపం దాల్చిన అసెంబ్లీ సెగ్మెంట్ ఏదైనా ఉందంటే వాసుపల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న దక్షిణ నియోజకవర్గమేనని చెప్పొచ్చు.

వార్డుల్లో సమావేశాలకు నేతలు కరువాయె !

దక్షిణం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోగల వైసిపి కార్పొరేటర్లంతా వాసుపల్లిపై తిరుగుబావుటా ఎగరవేయడంతో దాదాపు ఈ నియోజకవర్గంలో వైసిపి ఖాళీ అవుతోందా ? అన్న వాతావరణం ఏర్పడింది. శనివారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దక్షిణంలో నిర్వహించిన ఒక సమావేశంలో 10 మంది కార్పొరేటర్లకుగానూ ఒక్కరంటే ఒక్కరే హాజరుకావడంతో ఆయనకు మొహం మొత్తేసినట్టయింది. ఈ పరిస్థితిని ముందే ఊహించిన ఆయన పక్క చోట్ల నుంచి నాయకులు, కార్యకర్తలను తెచ్చుకున్నారు. 'రాకపోతే ఏం చేస్తాం. పక్కనుంచైనా తెచ్చుకోవాలి' కదా ! అన్న రీతిలో ఆయన ఈ సందర్భంగా ప్రసంగించిన వీడియో కూడా నగరంలో వైరల్ అయ్యింది. 29వ వార్డు ఉరుకూటి నారాయణరావు, 30వ వార్డు కోడూరి అప్పలరత్నం, 31వ వార్డు బిపిన్ జైన్, 32వ వార్డు కందుల నాగరాజు, 35వ వార్డు విల్లూరి భాస్కరరావు, 36వ వార్డు మాసిపోగు మేరీజోన్స్, 37 వార్డు చెన్న జానకిరామ్, 39వ వార్డు సాధిక్, 41వ వార్డు కోడిగుడ్ల పూర్ణిమ, 42వ వార్డు లీలావతి గతంలో కార్పొరేటర్లుగా ఆయా చోట్ల నుంచి గెలుపొందారు. వీరిలో కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచి అనంతర కాలంలో వైసిపిలో చేరారు. అక్కడ వాసుపల్లితో విభేదించి ఇద్దరు జనసేనలోకి వెళ్లారు. మరికొందరు అధికార పార్టీకి దూరం జరిగారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రాజకీయ అనిశ్చితిని అధిష్టానం ఎలా చక్కదిద్దుతుందో ? అని వైసిపి శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

మహిళలకు అండగా నిలవాలి

అలాంటి సంఘటనలు జరిగినప్పుడు జిల్లా అధికారులు చట్టంలో పేర్కొన్న నిబంధనలను, నియమావళిని పాటించాలని సూచించారు. ఈ క్రమంలో ఆయనతో పాటు కార్యక్రమంలో భాగస్వామ్యమైన పలువురు న్యాయ నిపుణులు పలు అంశాలపై వారి అభిప్రాయాలను, అనుభవాలను సదస్సులో పంచుకున్నారు. కార్యక్రమంలో విశాఖపట్టణం మెట్రో పాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, విశాఖపట్టణం కోర్టు రెండో అదనపు జడ్జి ఎం.వెంకటరమణ, ఇతర అదనపు న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి.శేషమ్మ, ఇతర సీనియర్ సివిల్ జడ్జిలు, పలువురు మెజిస్ట్రేట్లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, ప్రయివేటు సంస్థల ప్రతినిధులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయు విసిగా ప్రసాదరెడ్డి బాధ్యతల స్వీకరణ

మీడియాతో మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించగలమని ఎయు రుజువు చేసిందన్నారు. 2025-26లో వర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు.

ఆయన్ని తొలగించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చి, యూనివర్సిటీని వైసిపి రాజకీయ కేంద్రంగా మార్చిన గత వైస్ ఛాన్సలర్ పివిజిడి ప్రసాద రెడ్డిని తిరిగి రెండోసారి వైస్ ఛాన్సలర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడాన్ని ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రాము, నాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన్ని తక్షణం ఆ బాధ్యత నుంచి తొలగించాలని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. గత మూడేళ్ళ ఆంధ్ర యూనివర్సిటీని ప్రసాద్ రెడ్డి వైసిపి కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారని, అకడమిక్ వాతావరణాన్ని మంటగలిపారని, అనేక కోర్సులను రద్దు చేశారని తెలిపారు. కోర్సుల ఫీజులు, పరీక్షల ఫీజులు దారుణంగా పెంచి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఒసి పేద విద్యార్థులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. రెగ్యులర్ సీట్లను కుదించి సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా ఏకపక్షంగా మార్చేశారన్నారు. అనేక హాస్టల్స్ నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పారన్నారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని, అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి పటిష్ట చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. ఆయా శాఖల పరిధిలో చేయాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహక సమావేశం శనివారం సాయంత్రం కలెక్టరేట్ విసి.హాలులో ఆయన అధ్యక్షతన జరిగింది. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను విధిగా నిర్వర్తించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. వేడుకలు నిర్వహించే మైదానాన్ని సిద్ధం చేయాలని, పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని పోలీస్, జివిఎంసి అధికారులకు సూచించారు. ప్రొటోకాల్ బాధ్యతలు, సీటింగ్ ఏరేంజ్మెంట్లు చూసుకోవాలని ఆర్‌డిఒకు చెప్పారు. సాంస్కృతిక ప్రదర్శనలు గత ఏడాది మాదిరిగానే నిర్వహించాలని, ఈ ఏడాది మరిన్ని విభిన్నమైన తెలుగు పాటలను ఎంపిక చేయాలని డిఇఒకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, ప్రత్యామ్నాయంగా జెనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.మోహన్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ అఖిల, సిపిఒ శ్రీనివాసరావు, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు వి.మణిరామ్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామారావు, డిఇఒ చంద్రకళ, సివిల్ సప్లై, ఐసిడిఎస్, జివిఎంసి, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం.. అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

నిరాటంకంగా 40 రోజులుగా అంగన్‌వాడీలు స్ఫూర్తిదాయకమైన సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధం, అణిచివేత, బెదిరింపులు, హెచ్చరికలను లెక్కచేయకుండా, పండగ, పబ్బాలు వదిలి పోరాటం కొనసాగిస్తున్నారు. సమ్మెను నిషేధిస్తూ సర్కారు ఎస్మా చట్టం ప్రయోగించినా, షోకాజ్ నోటీసులు జారీ చేసినా వెనుదిరగకుండా ముందుకు సాగుతున్నారు. వారికి శక్తివంతమైన కార్మికవర్గం బలముంది. ఎంతో మంది ప్రజాస్వామిక, ప్రజాతంత్రవాదుల అండదండలున్నాయి. అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేసి బలహీనపర్చాలని ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, ఒత్తిళ్లు తెస్తున్నా వీరి ఐక్యపోరాటం ముందు ఆ పాచికలేవీ పారలేదు. షోకాజ్ నోటీసుకు సామూహికంగా వెళ్లి ప్రాజెక్టు అధికారులకు సంజాయిషీ నోటీసు ఇచ్చి నిరసన తెలిపారు తప్ప భయపడలేదు. ప్రభుత్వమెన్ని మాయోపాయాలకు దిగినా అంగన్‌వాడీల సమ్మెకు వున్న ప్రజాస్వామిక, పోరాట బలం, పౌర సమాజం మద్దతు ముందు అవన్నీ తుడిచిపెట్టుకుపోతున్నాయి.

(గ్రాట్యూటీ చెల్లించాలన్న సుప్రీంకోర్టు తీర్పు, తెలంగాణ రాష్ట్రంలో కంటే ఎక్కువ జీతం రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని వారు అడగడంలో అన్యాయం ఏముంది ? 2017 నుంచి బకాయిపడ్డ టిఎ, డిఎలు చెల్లించాలనడంలో తప్పేముంది?. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పోషకాహారం



మెనూ పెంచాలని కోరడంలో అసమంజసం ఎక్కడుంది ? వీరి డిమాండ్లు న్యాయమైనవి తప్ప, కొర్రెలెక్కడున్నవి ?.

ప్రయాణ ఖర్చులకు, ఖరీదైన భోజనాలకు ప్రజల సొమ్ము ఖర్చు పెడుతున్న పెద్దలకు, పేద కుటుంబాలకు పోషకాహారం అందిస్తున్న అంగన్‌వాడీల బాధలు, సమస్యలు పట్టడంలేదు. అందుకే రాజ ధర్మం మరిచి, విడిచి అప్రజాస్వామిక చర్యలకు ఈ ప్రభుత్వం పాల్పడుతోంది. అయినా అంగన్‌వాడీలు తమ పోరాట క్రమంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీలే కాదు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతినెలా ఒకటిన జీతాలు చెల్లించాలని, బకాయిలు జమ చేయాలని ఆందోళన చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం విజయవాడలో తలపెట్టిన 36 గంటల ధర్నాకు వెళ్లకుండా యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలను నిస్సిగ్గుగా ఎక్కడికక్కడ నిర్బంధించే చర్యలకు దిగి ప్రజాస్వామిక విలువలను, హక్కులను ఈ ప్రభుత్వం అపహాస్యం చేసింది. డిసెంబరులో మిచౌంగ్ తుపానుకు పంట నష్టపోయిన రైతుకు నెలైనా పరిహారం చెల్లించలేదు. ప్రభుత్వం తన పొరపాట్లు, తప్పిదాలను సరిచేసుకొనే మార్గం అన్వేషించకుండా, అత్యంత మొరటు పద్ధతులకు పాల్పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తన పంతంవీడి, అంగన్‌వాడీలు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. లేదంటే తన పతనానికి బలమైన పునాదులు ప్రభుత్వం వేసుకున్నట్లే.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: జివిఎంసి పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992 డిఎస్‌సి ఉపాధ్యాయులు మొదలుకొని జివిఎంసి పరిధిలోని విశాఖ, భీమిలి, అనకాపల్లి ఉపాధ్యాయుల పిఆర్‌సి, డిఎ బకాయిలు, జివిఎంసి సస్పెన్ అకౌంట్‌లో జమవుతున్న సొమ్ము మొత్తాన్ని ఉపాధ్యాయుల వ్యక్తిగత పిపిఎఫ్ ఖాతాల్లోకి తక్షణమే జమ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 2014 డిఎస్‌సి ఉపాధ్యాయుల నియామకపు తేదీ 17.6.2016 కాకుండా ప్రమాణ స్వీకారం చేసిన తేదీ 1.06.2016గా మార్పు చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం అనకాపల్లి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శులు గొంది చిన్నబ్బాయి, టిఆర్.అంబేద్కర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా కోశాధికారి కె.రాంబాబు, అనకాపల్లి జివిఎంసి నాయకులు ఎం.రాజు నాయుడు, విశాఖ జివిఎంసి నాయకులు శోభ ఉన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభంలో భాగంగా శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి హెల్మెట్ బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ క్రమంలో మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కూడా ఆవిష్కరించారు.

మహారాజ శ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సుముఖమునకు
O.S. 71/2019

వాది: కొయ్యాన నీలమ్మ
ప్రతివాదులు: గొలివి ఇల్లంనాయుడు వగైరాలు

టూ,
గొలివి తమ్మినాయుడు, S/o, లేటు దాలినాయుడు, 72 సంII, హిందూ, వ్యవసాయం, సా॥ సీతమ్మధార, ఈనాడు న్యూస్ పేపరు ఆఫీసు దరి, OK టైలర్ షాపు విశాఖపట్నం. -10వ ప్రతివాది

పై నెంబరు దావాలో వాది, మీ పైన(10వ ప్రతివాది) మరియు మరి కొంత ప్రతివాదులు పైన పై నెంబరు దావా షెడ్యూలు దాఖల ఆస్తిలో వాది యొక్క వాటాను రాబట్టే నిమిత్తం పై కోర్టులో పంపకం నిమిత్తం దావాను దాఖలు చేయగా పై నెంబరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం తే **29-1-2024** దిన పై **కోర్టులో వాయిదా అయి ఉన్నది.** సదరు వాయిదా నాడు మీరు గానీ, మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు కోర్టు వారి ఎదుట తెలియ జేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షముందు దావాను తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఆదేశాలతో //

మెట్ట దామోదరరావు
వాది తరుపు న్యాయవాది,
పొందూరు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
I.A.377/2022 O.S.2/2021

Between:
K.Lakshmana Gupta ....Petitioner/Plaintiff
And:
Konathala Seetharam.
.....Respondent/defendant

To:
Sri Konathala Seetaram, S/o K.T.Mahalaxmi Naidu, Hindu, aged 46 years, Business, resident of D.No. 1-17/ 7, Teacher's Colony, 9th street, Nagulapalli, Anakapalli, Visakhapatnam-531 001.

Please take notice that the above I.A.377/2022 filed by the petitioner/ plaintiff to set aside the dismissed for default order 7.01.2022 in the above matter and for recovery of suit amount due under suit promissory note stands posted to **06.02.2024** for your appearance and you should appear before the above and said court, on that day at about **10-30 A.M.** through your advocate or agent or in person without fail. If you failed to appear before the Court, the matter will be decided exparte in your presence.

(As per the orders dated 11.01.2024 of the Honourable Court.)

Vizianagaram, Date: 19.1.2024
Chintapalli Appa Rao,
Advocate for the Petitioner/Plaintiff
Vizianagaram

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో అనకాపల్లి
E.P. 19/2022 in O.S. 75/2016

బిట్వీన్:
శ్రీ మార్గాన రామారావు . . . డిక్రీహోల్డర్
అండ్:
శ్రీమతి బలివాడ త్రిపురవేణి
. . . జడ్జిమెంట్ డేటారు

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటిషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తంపై జడ్జిమెంటు డేటారు యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్తిని తేది 08-02-2024దిన వేలం వేయుటకు మహారాజు కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున వేలం **తే:08-02-2024దిన ఉదయం గం. 10-30 ని॥ల నుండి సా॥ 5.00 గం॥ల** మధ్య సమయంలో వేలం వేయుదురు. కావున వేలం పాటలో పాల్గొన దలచిన ఆసక్తి గల వారు పై తేదీన పై తెలిపిన శ్రీకోర్టు వారి ఎదుట హాజరయి వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

SCHEDULE PROPERTY

All that Property is shed and site at in S.No. 15/4A, 5,6 at gullapalli village, Sabbavaram Mandal, Anakapalli Dist area there is a manufacturing unit of corn flakes etc in an extect of 15 cents and bounded as follows
East : Site of D.Hr ie Margana Rama Rao
South: Site of Sri Gopala Krishnna
West: Site of D.Hr i.e. Margana Ramarao
North: Rasta belongs to D.Hr i.e. Margana Ramarao
DHR Value : Rs. 15,00,000/-
Amin Value : Rs. 19,00,000/-
JDR Value : Not Mentioned

A.VENKATESWARA RAO
Advocates, Visakhapatnam
Cell : 9246624779

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గిడిజాల విద్యుత్ లైన్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ సురేష్ కుమార్ తెలిపారు. గుమ్మడివానిపాలెం, సొంట్యాం, గిడిజాల, వేమగొట్టిపాలెం, ముచ్చర్ల, తాంగుడుబిల్లి, డిబ్బడిపాలెం, మిందివానిపాలెం తదితర గ్రామాలకు సరఫరా ఉండదని, గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : జిమ్సర్ ఆసుపత్రి, గీతం దంత వైద్య కళాశాల సౌజన్యంతో ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టు, ఎంవివిఎస్ మూర్తి ట్రస్టు ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు 12వ వార్డు పెదగదిలి కూడలి వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వార్డు టిడిపి ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు తెలిపారు. అన్ని రకాల దంత వైద్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, గర్భిణుల, కంటి, ఇసిజి పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో ఇచ్చిన కార్డులతో గీతం ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో రోగులను పరీక్షించి మందులు అందించనున్నట్లు తెలిపారు.

'శిష్టకరణాల అభివృద్ధే లక్ష్యం'

ప్రజాశక్తి -పిఎం.పాలెం : శిష్టకరణాలు అభివృద్ధే తమ లక్ష్యమని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దొంకాడ అనిల్ కుమార్ పేర్కొన్నారు. జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెంలోని శిష్టకరణాల సేవా సంఘం కార్యాలయంలో శనివారం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శిష్టకరణాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎస్.కె.మహంతి, ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, కులగణనకు వచ్చిన అధికారులకు కులం స్పష్టంగా శిష్టకరణం, బీసీ-డికి చెందిన వారిమని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, డబ్బీరు ప్రశాంతి, జయతి ఉమామహేశ్వరరావు, శేఖర్ మహంతి శ్రీనివాస్, ఎస్.ఎన్. రావు, లక్ష్మి, డాక్టర్ సుధాకర్ పట్నాయక్, మంత్రి మూర్తి, హరినాథ్ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో శుభ్రతకు శ్రీకారం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి వాంబేకాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ఆధ్వర్యాన మినీ జెసిబి సాయంతో తొలగించారు. కాలనీ బ్లాకుల మధ్య పందుల స్వైర విహారంతో పాటు చెత్త నుంచి దుర్గంధం వెదజల్లడంతో శుభ్రత పనులు చేపట్టారు. పూడికలు తొలగించి నివాసుల వాడుక నీరు ప్రధాన డ్రెయినేజీలోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. పరిసరాలు అధ్వానంగా ఉండడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని కార్పొరేటర్ పేర్కొన్నారు. వాడుక నీరు పోయే మార్గం బాగోలేక పాతే అనేక సమస్యలు వస్తాయని వివరించారు. ప్రజలు బ్లాకులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఇంటి పంటే ఆరోగ్యకరం

ప్రజాశక్తి-సీతమ్మధార : మన ఇంటి పంటే మనకు ఆరోగ్యకరం అని పద్మశ్రీ వై.వెంకటేశ్వరరావు అన్నారు. పౌర గ్రంథాలయంలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, రైతు నేస్తం శనివారం నిర్వహించిన మన ఇంటి పంట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ముడసర్లోవ పార్కు అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ పార్కు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. ముడసర్లోవ పార్కును శనివారం అధికారులతో కలిసి కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పురాతనమైన ఈ పార్కులో ఆకర్షణీయమైన చెట్లకు ఆటంకం కలిగించకుండా పునరాభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంచెలంచెలుగా టెండరు ప్రక్రియ ద్వారా పార్కును అభివృద్ధి పరచాలన్నారు. ఆకర్షణీయమైన మొక్కలతో గార్డెన్‌ను ఏర్పాటు చేయడం, కెఫెటేరియా, వాటర్ ఫౌంటైన్స్, సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, హార్స్ రైడింగ్, విశ్రాంతి స్థలం, యోగ ఆవరణ, జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా తదితర సదుపాయాలతో రూపొందించి ప్రజలకు, సందర్శకులకు అందించాలని పర్యవేక్షక ఇంజినీరు శాంసన్ రాజును ఆదేశించారు.

అనంతరం పార్కులో వాటర్ ఫిల్టర్ గ్యాలరీని పరిశీలించారు. ఆ గ్యాలరీలో నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముడసర్లోవ పార్కు తూర్పు భాగాన పాత పార్కు ప్రదేశంలో అధికంగా వ్యర్థాలు ఉండడం గమనించి, పరిశుభ్రత చేపట్టేలా సంబంధిత గుత్తేదారునికి ఆదేశించాలని జోనల్ కమిషనర్‌కు చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, హార్టికల్చర్ అధికారి గాజిబాబు, కార్యనిర్వాహక ఇంజినీరు శాంతిరాజు, అసిస్టెంట్ ఇంజినీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్ట్ వద్ద డ్రైవర్లు ధర్నా

ప్రజాశక్తి -ఆనందపురం : జిఒ 106 (2) రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ తర్లువాడ చెక్ పోస్ట్ వద్ద లారీ డ్రైవర్లు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్ల యూనియన్ ఆనందపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణ, పూడి అప్పారావు మాట్లాడుతూ, జిఒను రద్దుచేసే వరకూ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. పొట్ట కూటి కోసం ఈ వృత్తిలో దిగి ఎన్నో కష్టమైన పనులను చేస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. ప్రమాదవశాత్తూ జరిగే సంఘటనలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల అపరాధ రుసుమును వేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జయహో రథసారథి డ్రైవర్ క్లీనర్ల యూనియన్ రాష్ట్ర ప్రతినిధులు ఆర్.ముత్యాలనాయుడు, వి.సంతోష్, కె.ప్రసాద్, వి.అప్పలరాజు, జి.శ్రీను, మధురవాడ లారీ డ్రైవర్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఈగల కిరణ్, సెక్రటరీ చిన్నారావు, బంటుబిల్లి పైడి నాయుడు, చందక శ్రీను, కిలాని శ్రీను, బంటుబిల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటినీ వ్యవసాయ క్షేత్రంగా మార్చుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : ప్రతి ఇంటినీ వ్యవసాయ క్షేత్రంగా మార్చుకోవడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యాన్ని అందించే వాళ్లమవుతారని విశాఖ రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్య అన్నారు. 7వ వార్డులో రైతునేస్తం పురస్కార గ్రహీత బంగారు ఝాన్సీ మిద్దెతోటను తహశీల్దార్ సతీసమేతంగా శనివారం సందర్శించారు. కేవలం 60 గజాల మిద్దె మీద అనేక రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ, స్పైసెస్ మొక్కలను పెంచుతున్న ఝాన్సీని అభినందించారు. ఝాన్సీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని కొంచెం సమయం వెచ్చించి సేంద్రీయ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను పండించుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. మిద్దె తోట నిర్వహణలో తాను అవలంబిస్తున్న పూర్వీకుల నాటి సేంద్రీయ పద్ధతులను తహసీల్దార్ రమణయ్యకు బంగారు ఝాన్సీ వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు బంగారు ప్రకాష్, తెంటు మాధవి తదితరులు పాల్గొన్నారు.

బక్కన్నపాలెంలో గడపగడపకు...

ప్రజాశక్తి- పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి బక్కన్నపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. కాలనీలో రహదారులు, డ్రెయినేజీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు స్థానికులు వివరించారు. దీనిపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం పారదర్శకంగా అమలుచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, వైసిపి నాయకులు ముత్తంశెట్టి మహేష్, పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, సీయాద్రి అప్పలరాజు, పోతిన శివ, పోతిన ప్రసాద్, సియాద్రి కనకరాజు, పిళ్లా రమణ, రాయిన సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి రవీంద్రనగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపి, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పతివాడ వెంకటలక్ష్మి, పతివాడ కనకరాజు, బొండా శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యతకు చిహ్నం : ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : క్రీడలు ఐక్యతకు చిహ్నం అని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 1, 2, 3, 4 వార్డులు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలను శనివారం స్థానిక ఎండిఒ కార్యాలయం ఆవరణలో ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. గెలుపోటములను ఒకేలా స్వీకరించాలని, క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ బొడ్డేపల్లి రాము, ఎండిఒ డాక్టర్ వి.జానకి, యుసిడి ఎపిడి వై.సంతోష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, ఎఎంసి ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ముందుగా క్రికెట్ కిట్లు అందజేశారు

'25న బహిరంగసభను జయప్రదంచేయాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఈ నెల 25న భీమిలి నియోజకవర్గంలో జరగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు పార్టీ అధ్యక్షులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక చైతన్య నగర్‌లోని సావిత్రి హాస్టల్‌లో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుంటూరు జిల్లా నారాయణపురానికి చెందిన సాయిరామకృష్ణ (20)గా పోలీసులు గుర్తించారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐలా డంపింగ్‌యార్డులో మంటలు

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక ఆటోనగర్ ఐలా డంపింగ్ యార్డు రోడ్డులో శనివారం సాయంత్రం స్క్రాప్ తగలబెట్టడంతో భారీ మంటలు వ్యాపించాయి. మంటలను చూసి ఆటోనగర్ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. నల్లటి పొగలు చుట్టుపక్కల వ్యాపించడంతో సమీపంలోని అపార్ట్‌మెంట్ వాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ, దివీస్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లా గార ప్రాంతానికి చెందిన లావేటి దిలీప్ కుమార్ (24) ఈ నెల 17వ తేదీ నుంచి కనబడుట లేదని అతని తల్లి స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. తగరపువలసకు ఆనుకుని ఉన్న శ్రీరామ్‌నగర్‌లో ఓ అద్దె ఇంట్లో ఉంటూ దివీస్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్న దిలీప్‌కుమార్ ఈ నెల 16వ తేదీన భార్యతో కలిసి సంక్రాంతి పండగకు అత్తవారింటికి వెళ్లాడు. 17న దిలీప్ కుమార్ ఇంటికి వచ్చాడు. భార్య అతనికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఈ క్రమంలో దిలీప్‌కుమార్ కనబడుటలేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా సదస్సుకు డైట్ వైస్ ప్రిన్సిపల్

విద్యా సదస్సుకు ఎంపికైన రవి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇండియా టుడే గ్రూప్‌తో కలిసి తిరుపతిలోని హోటల్ తాజ్‌లో ఈ నెల 23, 24 తేదీల్లో పాఠశాల విద్యా శాఖ నిర్వహించే విద్యా సదస్సుకు భీమిలి ప్రభుత్వ డైట్ వైస్ ప్రిన్సిపల్ గొట్టేటి రవి ఎంపికైనట్లు డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో ప్రపంచ స్థాయి సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యా రంగ భవిష్యత్తుపై చర్చించేందుకు సంబంధిత సదస్సు ఓ శిఖరాగ్ర వేదికగా ఉపయోగ పడుతుందని రవి తెలిపారు. రాష్ట్ర పరిధిలోని విద్యా రంగానికి చెందిన పలు పథకాలు, విద్యలో డిజిటల్ విప్లవం, స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ పెంపు తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు వివరించారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పాత ఆరిలోవలో సామాజిక భవన నిర్మాణానికి శనివారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జివిఎంసి నిధులు రూ.15 లక్షలతో స్థానికుల అవసరాల కోసం ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారులు, వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జనిపల్లి శ్రీనివాసరావుతో ములాఖత్‌కు నిరాకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో దాడిచేసిన కేసులో జైలులో ఉన్న జనిపల్లి శ్రీనివాసరావుతో ములాఖత్‌కు వెళ్లిన తమకు జైలు అధికారులు అనుమతి నిరాకరించారని విరసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు తెలిపారు. శ్రీనివాస్ జైలులో నిరాహారదీక్ష విషయమై అనుమానాలు ఉండటంతో తెలుసుకునేందుకు తాము వెళ్లామని, మూడు గంటల పాటు ఉంచిన జైలు అధికారులు తరువాత అనుమతి లేదని పంపించేశారని తెలిపారు. జైలు అధికారుల వైఖరి చూస్తే అనుమానం వస్తుందన్నారు. నిబంధనల ప్రకారం ఖైదీని బంధుమిత్రులు వారానికి రెండుసార్లు కలిసే అవకాశం ఉన్నప్పటికీ ఈ వారంలో రెండో ములాఖత్ నిరాకరించడంలో ఏదో కుట్ర దాగి ఉందని ఆరోపించారు. శ్రీను ఆరోగ్యంపైనా, అతని నిరాహారదీక్షపైనా చాలా అనుమానాలు కలుగుతున్నాయని వెంకటరావు తెలిపారు.

విరాళాలు సేకరిస్తున్న భెల్ సిఐటియు నాయకులు

అంగన్‌వాడీల పోరాటానికి విరాళాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : అంగన్‌వాడీల పోరాటానికి మద్దతుగా భెల్ మెయిన్ గేటు వద్ద సంస్థలోని సిఐటియు నాయకులు శనివారం సంఘీభావ నిధిని సేకరించారు. మొత్తం రూ.8,176 వసూలైంది. ఈ కార్యక్రమంలో జిటిపి.ప్రకాష్, ఎస్.జగన్నాధరావు, ఆల్సి అప్పలనారాయణ, కె.నారపరెడ్డి, జి.అచ్చన్ననాయుడు, ఆర్.జనార్ధన్‌రావు, పి.శివరాం, పాల్గొన్నారు.

ఉక్కునగరం : అంగన్‌వాడీ కార్మికులకు మద్దతుగా ఆర్థిక సహకారం అందించిన ఉద్యోగులకు స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ధన్యవాదాలు తెలిపింది. స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అయోధ్యరాం పిలుపుమేరకు స్పందించిన ఉక్కు ఉద్యోగులు ఒక్కరోజులోనే రూ.93,180 ఇవ్వడం అభినందనీయమని పేర్కొంది. అంగన్‌వాడీల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరింది.

గాజువాకలో శంకర్ ఫౌండేషన్ సేవలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రాంతంలో శంకర్ ఫౌండేషన్ సేవలు విస్తరిస్తున్నట్లు హాస్పిటల్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ తెలిపారు. కొత్త గాజువాక బిసి రోడ్డులో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య సేవలను విస్తరించడంలో భాగంగా గాజువాకలో రెండు అల్ట్రా మోడ్రన్ ఆపరేషన్ థియేటర్లు, 20 పడకల సౌకర్యం, అత్యాధునిక రోగ నిర్ధారణ విధానాలు, ల్యాబ్, ఆప్టికల్, ఫార్మసీని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన కంటి వైద్య నిపుణులతో గాజువాక సెంటర్‌లో అవుట్ పేషెంట్లకు సేవలు అందిస్తోందని తెలిపారు డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగారురాజు మాట్లాడుతూ, ఫౌండేషన్ స్థాపించిన 1997 నుంచి నేటి దాకా 4,33,268 సర్జరీలు చేశామని, 25 లక్షల మంది అవుట్ పేషెంట్లకు సేవలు అందించామని, 3,18,316 మంది స్కూల్ పిల్లలకు స్కీనింగ్ టెస్టులు జరిపినట్లు తెలిపారు.

చెత్తను తొలగిస్తున్న జివిఎంసి సిబ్బంది

కుంచుమాంబ కాలనీలో చెత్త తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -గాజువాక : కుంచుమాంబ కాలనీలో పేరుకుపోయిన చెత్తను శనివారం జివిఎంసి అధికారులు తొలగించారు. 'కుంచుమాంబ కాలనీ రోడ్డుపై చెత్త' శీర్షికన ప్రజాశక్తిలో శనివారం ప్రచురితమైన కథనానికి జివిఎంసి గాజువాక జోన్ అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ స్పందించారు. శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే చెత్తను తొలగింపజేశారు.

చంద్రబాబును కలిసిన గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో "రా కదిలిరా" బహిరంగ సభకు వెళ్లనున్న సందర్భంగా విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును ఎమ్మెల్యే గణబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.

సాహిత్య సేవకుడు అజీజ్

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ చారిత్రిక నవలా రచయిత ఎస్‌డివి అజీజ్ సాహిత్య సేవకుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. అజీజ్ తెలుగులో రాసిన అల్లూరి సత్యనారాయణరాజు (ఓ స్వాతంత్ర్య సమరయోధుడు 1913-1963) జీవితగాధను పారనంది నిర్మల హిందీలో అనువదించిన నవలను శనివారం స్థానిక పౌర గ్రంథాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ఆవిష్కరించారు. అరసం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ, రచయిత అజీజ్ అల్లూరి జీవిత విశేషాలతో పాటు ఆనాటి సామాజిక పరిస్థితులను, స్వాతంత్ర్య ఉద్యమం నాటి సంఘటనలను నేటి తరం వారికి దగ్గరగా రచన చేయడం గొప్ప శుభపరిణామం అన్నారు. నేటి తరం యువత ఇలాంటి నవలను చదవాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సత్యనారాయణరాజు సలిపిన పోరాట పటిమ కళ్లకు కట్టినట్టు అజీజ్ రాశారని తెలిపారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది అల్లూరి సీతారామరాజు, ఏపీ క్షత్రియ ఫెడరేషన్ అధ్యక్షుడు చెరుకూరి వెంకటపతిరాజు, రచయిత ఎస్‌డివి అజీజ్, విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు బి.రాధారాణి, రచయితలు కెజి.వేణు, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, శ్యాంసుందర్, రాజు, బొట్ట అప్పారావు, బసుపోతన తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సత్యనారాయణరాజు నవల హిందీ అనువాదాన్ని ఆవిష్కరిస్తున్న శర్మ తదితరులు

పురోగతిలేని ఎన్‌జెసిఎస్ సమావేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఢిల్లీలో శనివారం జరిగిన ఎన్‌జెసిఎస్ సమావేశంలో ఎటువంటి పురోగతి లేదని సిఐటియు నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉక్కు కార్మికులకు నూతన వేతనాల విషయాన్ని ఏమాత్రమూ పట్టించుకోలేదని, సెయిల్‌లో విలీనం అంశంపై మాట్లాడలేదని వివరించారు. కార్మికులకు సంబంధించిన ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించేందుకు ముందుకు రాలేదని పేర్కొన్నారు. యాజమాన్య వైఖరిని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయని తెలిపారు. ఈ నెల 29,30 తేదీల్లో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మెలో పాల్గొనాలని బిఎంఎస్‌ను కూడా అన్ని యూనియన్లు కోరినట్లు పేర్కొన్నారు.

నేడు గిరిబాబు పుట్టిన రోజు వేడుకలు

ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు పుట్టిన రోజు వేడుకలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పద్మనాభం మండలానికి జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ పదవి స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో వచ్చిందని స్థానిక నాయకులు చెబుతూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సుంకర గిరిబాబు జీవిత చరిత్ర

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుంకర గిరిబాబు 1977 జనవరి 21న తండ్రి వెంకటలక్ష్మినారాయణరావు, తల్లి సూర్యకాంతానికి ప్రథమ సంతానంగా జన్మించారు. ఉన్నత చదువులు చదివిన అనంతరం రాజకీయ ప్రస్తానం చేశారు. 1994-95లో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా, 1999లో జిల్లా యుత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా, 2005లో రెడ్డిపల్లి కో-ఆపరేటివ్ అధ్యక్షులుగా, 2012లో విశాఖపట్నం డిసిసిబి వైస్ చైర్మన్‌గా, 2014లో వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా, 2021లో పద్మనాభం మండల జెడ్‌పిటిసిగా, 2023లో విశాఖపట్నం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. రాజకీయంగా ఎదుగుతూ బడుగుబలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సహాయసహకారాలు అందించారు.

డైరీ విడుదల

ప్రజాశక్తి-సీతమ్మధార : మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగ అప్పారావు, టివివి సత్యనారాయణ, ఎన్.బాబి, వి.నారాయణరావు, నాగభూషణం పాల్గొన్నారు.

జనసేన సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పద్మనాభం మామిడితోటలో శనివారం జనసేన మండల నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భీమిలి నియోజక వర్గ జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సైన్యంలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమములో నాయకులు కృష్ణయ్య, శాఖరి శ్రీను, మజ్జి శ్రీను, కురిమిన రామస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : చంద్రబాబు సూచనలతో దళితులను అవమానపరుస్తూ పచ్చ మీడియా తప్పుడు రాతలు రాసిందని ఆరోపిస్తూ తాటిచెట్లపాలెం ధర్మానగర్‌లో దళిత సంఘాల ప్రతినిధులు నిరసన తెలియజేశారు. బిఆర్ అంబేద్కర్ విగ్రహనికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో దళితుల ఓటు విలువ టిడిపికి తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఐ.రవికుమార్, సుకుమార్, కె.విజయ్, గురువోజీ, నూకరాజు, భద్రి, సాయి, సురేష్, నాగరాజు, కృపా, జైకుమార్, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీసీకి కెకె.రాజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా మరొకసారి నియమితులైన ఆచార్య పివిజిడి ప్రసాద్‌రెడ్డిని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి యూత్ అధ్యక్షులు ఆళ్ల శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలు

గోపాలపట్నంలో ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలను పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి పంచిపెట్టారు.

గోపాలపట్నం : స్థానిక కుమారి కల్యాణ మండపంలో ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకలను జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు ఏర్పాటుచేసిన పుట్టినరోజు వేడుకల్లో ఆనంద్‌కుమార్ కేక్ కట్ చేసి అందరికీ అభినందనలు తెలియజేశారు. మీ అభిమానం కలకాలం ఉండాలన్నారు. ఆనంద్‌కుమార్‌ను నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. అనంతరం 91వ వార్డుకు చెందిన జాన్ విక్టర్‌కు, బాజీ జంక్షన్ ఎస్‌పి కాలనీకి చెందిన లక్ష్మీకాంతానికి వీల్ చైర్లను ఆనంద్ కుమార్ పంపిణీ చేశారు. 91వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన సాయి మణికంఠ, సోమరాజులకు వినికిడి మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు పేడాడ రమణికుమారి, మార్కెటింగ్ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, కార్పొరేటర్ పుర్రె సురేష్, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీను, నాయకులు గునిశెట్టి శ్రీనివాసరావు, జి.అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరాస: జివిఎంసి 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యాన శాంతినగర్ కమ్యూనిటీ హాల్లో ఆడారి ఆనంద్ కుమార్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు ఏర్పాటుచేసిన పుట్టినరోజు వేడుకల్లో ఆనంద్‌కుమార్ కేక్ కట్ చేసి అందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జియ్యాని మారుతి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : 61వ వార్డు మల్కాపురం ప్రధాన రహదారిలో బుస అప్పలరెడ్డి ఆధ్వర్యాన 60వ వార్డులో పివి.సురేష్ ఆధ్వర్యాన ఆడారి ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఆడారి జన్మదిన వేడుకలు జరిపి, పలువురికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలిదిండి భద్రీనాథ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురంలో ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి

మంత్రులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి

అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత 40 రోజులుగా సమ్మె చేస్తున్నారని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు వారి న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. లక్షల మందికి పైగా ఉన్న అంగన్వాడీలు పిల్లలు, మహిళలు, గర్భిణీలకు సేవలందిస్తున్నారని, అంగన్వాడీ కేంద్రాలలో సేవలు పొందుతున్న లబ్దిదారులు ఎస్సి, ఎస్టి, బలహీన వర్గాలు, అసంఘటిత కార్మిక, పేద రైతు, వ్యవసాయ కార్మిక కుటుంబాలకు చెందిన వారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణాలోకన్నా రూ.1000 అదనంగా వేతనం పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని కోరుతున్నారని, వారి న్యాయమైన కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా తాత్సారం చేయడం అన్యాయమన్నారు. విధుల్లో జాయిన్ కాకుంటే తొలగిస్తామని హెచ్చరించడం దుర్మార్గమన్నారు. జిల్లాలో వున్న ఇద్దరు మంత్రులు అంగన్వాడీల సమస్యలను విస్మరించడం దారుణమన్నారు. నాడు వారి ఓట్లుతో అధికారంలోకి వచ్చి నేడు వారు రోడ్లపై గత 40 రోజులుగా నిరసనలు చేస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. జిల్లాలో వున్న ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి వారి సమస్యలపై సంబంధిత సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం అయ్యే చూడాలని లోకనాథం డిమాండ్ చేశారు.

ఎయు విసిని కలిసిన డాక్టర్ ఖాశీం

ప్రజాశక్తి-కె.కోటపాడు

విసికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఖాశీం

ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్గా రెండవ పర్యాయం నియమితులైన ప్రొఫెసర్ పీవీజీడీ. ప్రసాదరెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం, స్థానిక అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం మర్యాద పూర్వకంగా కలిసి హార్దిక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరు ఖాశీం మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం మరింత ప్రగతి పథంలో నడిపించించాలని అకాంక్షించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాలు సమర్థవైన వైస్ ఛాన్సెలర్ ప్రసాద రెడ్డి సమక్షంలో జరగనుండటం ఆనందదాయకమని డాక్టర్ ఖాశీం అన్నారు.

డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో డ్రగ్ డి అడిక్షన్ సెంటర్లో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు ఒక సంవత్సరం తాత్కాలిక ప్రాతిపదికన జరిపే నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యాధికారి, కౌన్సిలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అర్హత గలవారు తమ అన్ని సర్టిఫికెట్లను దరఖాస్తునకు జతపరిచి సూపరింటెండెంట్ వారి కార్యాలయం జిల్లా ఆసుపత్రి అనకాపల్లిలో ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల లోపు అందించాలని సూచించారు. పోస్టులన్నీ ఓపెన్ కాంపిటీషన్ కేటగిరిలో నింపబడతాయన్నారు. దరఖాస్తు ఫారాలను www.anakapalli.ap.gov.in అనే వెబ్సైట్లో డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు.

ఎంపిపి కుటుంబానికి అండగా ఉంటాం

నాగరాజు సంతాప సభలో ఎమ్మెల్యే ధర్మశ్రీ

ఎంపిపి నాగేశ్వరిదేవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ తదితరులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట ఎంపీపీ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ తెలిపారు. శనివారం ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి భర్త నాగరాజు సంతాపసభ మండలంలోని సీతయ్యపేటలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ముందుగా నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు, వైసీపీ సీనియర్ నాయకులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, దొండా నారాయణమూర్తి, మాజీ జడ్పీటీసీ వియ్యపు అప్పారావు, గోకివాడ కోటేశ్వరరావు, బుదిరెడ్డి అప్పారావు, జిల్లా యాదవ సంఘం నాయకులు నమ్మి అప్పలరాజు, బిసివై పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బొట్టా చిన్ని యాదవ్, స్థానిక సర్పంచ్ వజ్రపు శ్రీను, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన్ రావు, ఎంపిడిఓ సువర్ణ రాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్ : జిల్లాలోని ఆర్టీసీ కార్మికుల దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఎపిఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ (ఎన్ఎంయుఎ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి మూడవ రోజుకు చేరాయి. దీక్షలను యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.పి. యం.రాజు ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ, ప్రధానంగా కౌన్సిలింగ్ పేరిట చార్జులు వేయాలని, సీనియారిటీకి న్యాయం చేయాలని కోరారు. డ్రైవర్లు ఎక్కువ శాతం 5,6 తరగతులు చదువు కున్న వారే ఉన్నారని, వారికి డిజిటల్ చార్టులపై అవగాహన లేదని సీనియారిటీ ప్రకారం పిలిచి చార్జు వెయ్యడానికి నిరాకరించడం అన్యాయమన్నారు. వారు కోరుకున్న చార్జ్ వేయడంతో ఆ రూట్లో ప్రయాణికులతో ఉన్న సత్సంబంధాల మేరకు ఎర్నింగ్స్ పెరగడమే కాకుండా నచ్చిన కండక్టర్లు డ్రైవర్లు ఒకే మాటపై ఒకే రూట్ పెట్టుకోవడంతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. అన్ని కేటగిరి ఖాళీలు భర్తీ చేయాలని, వెహికల్ కండిషన్ మెరుగు పర్చాలని స్పేర్స్ టూల్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీక్షల్లో గాజువాక డిపో కార్యదర్శి శంకరరావు,డివిజనల్ సెక్రటరీ ఎ.కె శివాజీ,వాల్టేర్ డిపో కార్యదర్శి అర్. వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప

పోక్సో చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలు పోక్సో యాక్టను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జూనియర్ సివిల్ జడ్జ్ పి ప్రదీప సూచించారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం గవరపాలెం మున్సిపల్ చిన్న హైస్కూల్లో మహిళలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఆశ వర్కర్లు, అంగన్వాడీలు, ఆరోగ్య ఉద్యోగులు సుమారు 500 మంది మహిళలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ హేమంత్, డి.ఎస్.పి సుబ్బరాజు, జోనల్ కమిషనర్ వెంకటరమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తాసిల్దార్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేసే వరకు పోరాటం

ప్రజాశక్తి- అనకాపల్లి

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 27/2023ను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని న్యాయవాదులు స్పష్టం చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ను రద్దు చేయాలని కోరుతూ అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లిలో న్యాయవాదులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల హక్కులు, ఆస్తుల రక్షణకు భంగం కలిగించే ఈ చీకటి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో సీనియర్ న్యాయవాదులు సుంకర శ్రీనివాసరావు, గేదెల నాగేశ్వరరావు, ఆర్.డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఉత్తమ వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహనరావు అన్నారు. శనివారం మండలంలోని వారాడలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేరుశనగ పంటకు ఎకరాకు 200 కేజీల జిప్సం రెండవ గొప్పు సమయంలో వాడాలని సూచించారు. దీనివలన కాయలు పెద్దగా ఉండి నూనె శాతం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. గంధం ఆగ్రోస్ అధినేత గంధం సునీత మాట్లాడుతూ పొలంబడి ప్రమాణాల ద్వారా పొందిన పంటలకు అధిక ధరలను ఇచ్చి కొనుగోలు చేయుటకు తమ సంస్థ ముందుంటుందని చెప్పారు. నెలల వారీగా పంటల వివరాలను ఎఫ్పిఓల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు చిరంజీవి, విజేత, తులసీమని, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

ఘనంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి

ఉత్తరాంధ్రలోనే పేరుగాంచిన వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. శనివారం వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గౌరీ పరమేశ్వరులను నెలకొల్పారు. ఈ రథాన్ని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి రమేష్లు లాగి ప్రారంభించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మెయిన్ రోడ్డుపై ఏర్పాటుచేసిన జాతరను వేలాది మంది ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి తిలకించారు. మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన భారీ మందుగుండు హంగామాతో ప్రజలు కేరింతలు కొడుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, ఉపాధ్యక్షులు ఎస్ నర్సింగరావు, సహాయ కార్యదర్శి పసన శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్, వీధి పెద్దలు దొమరతు రామారావు, ముత్తా ఈశ్వరరావు, గరికి వెంకట్రావు, నల్లా దేవుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు

ఆలయాన్ని కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు దంపతులు, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నాయకులు పరుచూరి భాస్కరరావు, లీడర్ పత్రికా అధినేత వివి రమణమూర్తి, అధికారులు తదితరులు దర్శించుకొని పూజలు చేశారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న మాజీ మంత్రి దాడి, మాజీ ఎమ్మెల్యే పీలా

రహదారి నిబంధనలు పాటించాలి

కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

వాహన చోదకులు రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. "సురక్షితమైన రహదారి మీ జీవితానికి రక్ష", "ప్రాణదాతల రక్షణ కొరకు మార్గదర్శకాలు" అనే కరపత్రాలను శనివారం తన చాంబర్లో కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ తుచా తప్పక పాటించాలని సూచించారు. ఎక్కడైనా ప్రమాదం జరిగినట్లయితే వారికి తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రాణాంతక రహదారి ప్రమాదాలలో క్షతగాత్రులను గోల్డెన్ అవర్ సమయంలో ఆసుపత్రి లేదా ట్రామాకేర్ సెంటర్‌కు తరలించి తగిన చికిత్సను అందించడం ద్వారా ప్రాణాలను కాపాడిన ప్రాణదాతలకు ప్రభుత్వం రూ.5వేల నగదు, ప్రశంసా పత్రం, జాతీయస్థాయి ప్రాణదాతలకు లక్ష రూపాయల అవార్డు ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.దయానిధి, జిల్లా రవాణా అధికారి కె.వి.ప్రకాష్‌రావు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తదితరులు

కోడిపందెం జూదరులకు ఐదు రోజులు జైలు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని దేశపాత్రునిపాలెం పరిధిలో కోడిపందేలు ఆడుతూ పోలీసులకు పట్టుబడిన నలుగురు జూదరులకు కోర్టు ఐదు రోజులు జైలు శిక్ష విధించింది. పోలీసుల కథనం ప్రకారం... దేశపాత్రునిపాలెం పరిధిలో సంక్రాంతి ముందు కోడిపుంజులకు కత్తులు కట్టి పందేలు ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా ముసలి నాయుడు, గంగవరపు రాజు, కోడూరు జాగవరపు, జాగవరపు శ్రీను నలుగురు పట్టుపడ్డారు. వీరిపై పోలీసులు క్రైమ్ నెంబర్ 29/ 2024 యు/ఎస్ 9 (11) ఎపి గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి అనకాపల్లి రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డి విజయలక్ష్మి ముందు హాజరుపర్చారు. దీనిపై విచారణ చేసి, నిందితులు నలుగురికి 5 రోజులు జైలు శిక్ష విధిస్తూ శనివారం విజయలక్ష్మి తీర్పు ఇచ్చారు.

నిధులు మంజూరుకు సిఫార్సుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకాంబిక అమ్మవారి దేవస్థానంలో పది కోట్ల రూపాయిలతో పునర్నిర్మితమౌతున్న ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసేందుకు సిఫారసు చేసిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఈవో బండారు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆరు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయం తో పాటు రోడ్డుని ఆనుకొని వున్న దక్షిణ రాజ గోపురాన్ని సుమారు 1కోటి 71 లక్షల రుపాయలతో విశాలమైన రాతి రాజగోపురంగా నిర్మించడానికి, నిత్యం భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రోడ్డు నుంచి గుడికి వున్న క్యూ కాంప్లెక్స్ మండపాన్ని 1కోటి 60 లక్షల రూపాయిలతో మరింత విశాలంగా నిర్మించడానికి సిజిఎఫ్ నిధుల నుంచి 3 కోట్ల 31 లక్షల గ్రాంట్ మంజూరు అయ్యేలా సిఫార్సు చేయాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. దీనిపై మంత్రి అమర్‌నాథ్ తక్షణమే స్పందించి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీకి, దేవదాయ ధర్మదాయ శాఖ కమీషనర్‌కు నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ సిఫార్సు చేశారని చెప్పారు.

నేడు పరవాడలో బిసి సదస్సు

ప్రజాశక్తి- పరవాడ : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పరవాడ మరిడిమాంబ కళ్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బీసీ సదస్సు ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు వియ్యపు చిన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి హాజరవుతున్నారని, మండలంలో టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, బీసీ సంఘాలు నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు ప్రజాసాహితి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : లెనిన్ శత వర్ధంతి సందర్భంగా స్థానిక నరసింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో ఈనెల 22న సాయంత్రం ఐదు గంటలకు ప్రజాసాహితి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ జరుగుతుందని జన సాహితి జిల్లా అధ్యక్షులు ఐటిఆర్‌వి శివాజీరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి అభ్యుదయవాదులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలో శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సబ్బవరం మేజర్ పంచాయితీకి చెందిన రోమాల దేముడు కుమారుడు రోమాల చంద్రశేఖర్ (పెందుర్తి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు) శనివారం రూ.1,49,999 విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఆలయ నూతన నిర్మాణానికి విరాళం అందజేసిన రోమాల చంద్రశేఖర్‌కు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, గెడ్డం కృష్ణ, బర్ల రమణ, దంగేటి ప్రకాష్, దంగేటి నాని, ఉసిరిగల రమేష్ పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న రోమాల చంద్రశేఖర్

పంచాయతీ, దేవాదాయశాఖ స్థలం కబ్జాపై జనసేన నిరసన

ఆందోళన చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-చోడవరం

ఆర్టీసీ స్థలం పేరు చెప్పి పంచాయతీ, దేవాదాయ శాఖ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఖాళీ స్థలం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గం నాయకులు జెర్రిపోతుల నానాజీ మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నాలుగు ఎకరాల స్థలాన్ని సేకరించారని, దీనిలో సుమారు మూడు ఎకరాల 50 సెంట్లు స్థలంలో ఆర్టీసీ వినియోగించగా మిగతా అరెకరా స్థలాన్ని ఇటీవల ఆర్టీసీ 33 సంవత్సరాలు లీజుకు చోడవరానికి చెందిన వ్యక్తులకు అప్పగించిందని తెలిపారు. లీజుదారులు దీనిని ఆసరాగా చేసుకొని పంచాయతీ, దేవాదాయ శాఖకు చెందిన మరో 50 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి భవనాల నిర్మాణానికి పూనుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే రెవెన్యూ అధికారులు సర్వే జరిపి ఏయే శాఖలకు చెందిన స్థలం ఎంతెంత ఉందో తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తాతారావు, గోవిందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ప్రమాణం చేస్తున్న దృశ్యం

ఫార్మాసిటీలో రోడ్డు భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి- పరవాడ : పరవాడ రాంకీ ఫార్మాసిటీలో శనివారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫార్మాసిటీ ఉద్యోగులకు, డ్రైవర్లకు, ఇతర వాహనదారులకు రోడ్డు భద్రతపై పరవాడ సీఐ ఎస్.బాలసూర్యరావు అవగాహన కల్పించారు. 'నేను తప్పనిసరిగా సీటు బెల్టును ధరిస్తానని, చరవాణి నడుపుతూ వాహనం నడపనని, తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తానని, తప్పనిసరిగా రహదారి నిబంధనలను పాటిస్తానని, ఇతర రోడ్డు వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మెలగుతానని, అతి వేగంతో వాహనం నడపనని' వారి చేత సిఐ ప్రమాణం చేయించారు.

కెజిహెచ్ సెక్యూరిటీ గార్డుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్: ఉత్తరాంధ్ర జిల్లాలలో ప్రసిద్ధి చెందిన కెజిహెచ్ లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు మూడు మాసాలుగా జీతాలు చెల్లించలేదని సిఐటియు సీనియర్ నాయకుడు వై.రాజు అన్నారు. తక్షణం వారికి మూడు నెలల జీతాలు చెల్లించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సమయంలో కూడా జీతాలు లేక సెక్యూరిటీ గార్డుల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాయని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించాలన్నారు. జీతాలు అందక పోయినప్పటికీ క్రమశిక్షణతో సెక్యూరిటీ గార్డులు ఉద్యోగాలు చేయాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ స్థాయి అధికారులు వారిని తరచూ వేధిస్తున్నారని చెప్పారు. లక్షల రూపాయలు జీతాలు పొందుతున్న అధికారులు కార్మికుల బాధలు పట్టించుకోకపోతే ఎలా అన్నారు.

వైసిపి ఎంపిపి రొంగలికి పితృ వియోగం

ప్రజాశక్తి -కె.కోటపాడు : మండల పరిషత్తు ఉపాధ్యక్షులు రొంగలి సూర్యనారాయణ తండ్రి రొంగళి అప్పలనాయుడు (94) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. వయసు మీద పట్టడంతో పాటు కొంతకాలంగా అనారోగ్యం ఉండడంతో ఇంటి వద్దనే అప్పలనాయుడు మృతి చెందారు. మండలంలోని చౌడువాడ శివారు పాచిలవానిపాలెం ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, చౌడువాడ గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, ఎంపీటీసీ ఏటుకూరు రాజేష్ తదితరులు అప్పలనాయుడు మృతదేహాన్ని సందర్శించి సూర్యనారాయణ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

నేడు వైసిపి ముఖ్య నాయకుల సమావేశం

ప్రజాశక్తి -పరవాడ : మండలంలోని దలాయి పాలెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్‌రాజ్ అధ్యక్షతన వైసిపి ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం సాయంత్రం 3 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఆ మండల అధ్యక్షులు కోన రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న భీమిలిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య కేడర్‌తో జరగబోవు మీటింగ్‌కి హాజరయ్యేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమాశానికి మండలంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, నామినేటెడ్ పదవులు ఉన్న నాయకులు, హాజరు కావాలని కోరారు.

దొంగ ఓట్లపై ఆధారపడుతున్న జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తను అమలు చేసిన నవరత్నాలపై నమ్మకం లేక దొంగ ఓట్లపై ఆధారపడి మళ్లీ గెలవాలని చూస్తున్నారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో నాటి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఐఎఎస్ అధికారి గిరీష్ లాగిన్ ద్వారా 30 వేల దొంగ ఓట్లు లబ్ది పొందడానికి సహకరించారని తెలిపారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు హరి నారాయణరావు, వెంకట అప్పలనాయుడు టిడిపి ఫిర్యాదులపై స్పందించక పోవడం వల్ల ఈనాడు అన్ని జిల్లాల్లో దొంగ ఓట్లు నమోదుకు వైసిపికి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. అందువల్లే వై నాట్ 175 అంటున్నారన్నారు. ఇటీవల చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల కమిషన్‌కు ఆధారాలతో కూడిన ఫిర్యాదు చేయడంతో డొంకంతా కదిలిందన్నారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో సుమారు 70,000 చనిపోయిన, వలస వెళ్లిన, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారివి పక్కాగా నియోజవర్గాల వారీగా లిఖితపూర్వకంగా ఇప్పటికే అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, తుది జాబితా ప్రకటించే ముందు తమ ఫిర్యాదులను పరిగణనలోనికి తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ కెకెవి.నారాయణరావు, షేక్ బాబర్, బొడ్డేడ మురళి, కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

రెల్లి కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్న రెల్లి కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరుతూ శనివారం రెల్లిహక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ రెల్లి కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెన్నా తిరుమలరావు, సింగంపల్లి కళ్యాణ్, చెన్నా వెంకట్రావు, కస్తూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. రెల్లి హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆడమ్స్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జివిఎంసి కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దోమల వృద్ధిని అరికట్టడంపై, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ జివిఎంసి ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. శనివారం అయిన తన ఛాంబర్లో జివిఎంసి ప్రజారోగ్య అధికారులు, జిల్లా మలేరియా అధికారితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు, దోమల వృద్ధిని అరికట్టుటకు చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, బయాలజిస్ట్ సాంబమూర్తి, మలేరియా ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆదివాసీలకు పట్టాలు ఇవ్వాలి

-గిరిజనేతరులకు మంజూరు చేయడం తగదు - ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ నాన్ షెడ్యూల్ గిరిజన మండలాలైన రోలుగుంట, రావికమతం, వి.మాడుగులు మండలాల్లో 78 గ్రామాల ఆదివాసి గిరిజనులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గోవిందరావు మాట్లాడుతూ, జగనన్నకు చెపుదాం ద్వారా అటవీ హక్కుల పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని తెలియజేసామని, గత ఆగస్టు, సెప్టెంబర్ నెలలో మూడు మండలాల్లో గిరిజనులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఆర్ ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని వి.మాడుగుల మండలం ఉర్ల రెవిన్యూ వెబ్లాండ్ రికార్డులో నమోదు చేయాలని ఎనిమిది గ్రామాలకు చెందిన 200 మంది ఆదివాసీ రైతులు ఫిర్యాదు చేశారని తెలిపారు. గిరిజన ప్రజలు సాగులో ఉన్న భూములకు జగనన్న రీ సర్వేలో గిరిజనేతర్లకు పట్టాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు స్థానిక రెవెన్యూ అధికారులు కుమ్మక్కై గిరిజనులను వారి భూముల నుండి వెళ్ళగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వీటిని అడ్డుకుని గిరిజన భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పివిటిజిలకు 35 కేజీల అంత్యోదయ కార్డులు, ప్రధానమంత్రి పివిటీజీ డెవలప్మెంట్ మిషన్ వర్తింపు చేయాలని, నర్సీపట్నం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేస్తానన్న ప్రభుత్వం హామీని అమలు చేయాలని ఈ సందర్భంగా గిరిజనులు ఆర్డిఓ దృష్టికి తీసుకెళ్లారు.ఆర్డిఓ స్పందిస్తూ తక్షణమే డివిజన్ పరిధిలోని ఎస్డి ఎల్సి సమావేశం ఏర్పాటు చేస్తానని, గిరిజన సమస్యలపై జిల్లా కలెక్టర్కు నివేదిక ఇస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.నరసింహమూర్తి, పివిటిజి సంఘం అధ్యక్షులు కొర్ర కొండబాబు, ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత గోవిందరావు

కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వైభవంగా వెంకన్న కల్యాణం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని డొంకాడలో వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో స్వామి కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో మేళ తాళాలు, కోలాట ప్రదర్శనతో స్వామి వారిని ఊరేగించారు. ఈ సందర్భంగా తీర్థం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పండ్లు ఇస్తున్న అభిమానులు

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:వైసిపి నాయకులు, కెజిహెచ్ పూర్వ ఆర్ఎంఓ డాక్టర్ బంగారయ్య జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. స్థానిక సి హెచ్సిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, నరేంద్ర, మహేష్, ఈశ్వరరావు, సూర్య, చక్రి, మణికంఠ, శ్రీను, హరీష్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ చెల్లయ్యమ్మ మృతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:మండలంలో వేములపూడి పంచాయతీ మాజీ సర్పంచ్ మాజీ ఎమ్మెల్యే బోలె ముత్యాలపాప అత్త చెల్లయమ్మ శనివారం ఉదయం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ఆమెకు వెంకటరమణ, రాంప్రసాద్ ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వేములపూడి గ్రామం లో ఆమె ఇంటి వద్ద మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, జెడ్పిటిసి సుకల రవణమ్మ ఎంపీపీ సుర్రాల రాజేశ్వరి ఆమె మృత దేహానికి నివాళులర్పించారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక గురుకులంలో శనివారం జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని ఎంఈఓ నరేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, 240 మంది విద్యార్థులకు గాను 203 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

'ఉపాధి' పనులపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి -కోటవురట్ల:2022-23 ఆర్థిక సంవత్స రానికి గాను మండల వ్యాప్తంగా చేపట్టిన పలు ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం శనివారం తనిఖీలు నిర్వహించింది. మండలంలో పలు అభివృద్ధి పనులు, సిబ్బంది వేతనాలపై తనిఖీలు నిర్వహించారు. వేతనాల నిమిత్తం కోటి 27 లక్షలు సుమారు ఖర్చు చేయగా, మెటీరియల్ రూపంలో మూడు కోట్ల 57 లక్షల సుమారు ఖర్చు చేసినట్లు తనిఖీ సిబ్బంది వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాయుడు పాల్గొన్నారు.

ఆడిట్ చేస్తున్న సిబ్బంది

ఆనంద్ కుమార్కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి:విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకలను మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, డెయిరీ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు .మండలంలోని చినదొడ్డిగల్లు బల్క్ కూలింగ్ సెంటర్ వద్ద కేక్ కట్ చేశారు.స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుని యూనిట్ మేనేజర్ శ్రీను, సూపర్వైజర్ కిరణ్, వేతన కార్యదర్శులు, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం విశాఖ డెయిరీలో ఆనంద్ను గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

కేక్ను కట్ చేస్తున్న అభిమానులు

గ్రామాల్లో కుల గణన సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-రావికమతం:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుల గణన సర్వేను కవగుంట సర్పంచి దాసరి సూర్యకుమారి గ్రామంలో శనివారం ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ కలసి సంయుక్తంగా సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కుల గణన కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషకర మన్నారు. దీని ఆధారంగా గ్రామాలలో ప్రణాళిక తయారు చేసుకొని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి సులభతరం అవుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ బర్నికాన గంగరాజు, వాలంటీరు ప్రగడ నాయుడు బాబు పాల్గొన్నారు.

వడ్డాది:బుచ్చయ్యపేట మండలంలోని మంగళాపురం పంచాయతీ కుముందానుపేట గ్రామంలో కుల గణన సర్వే సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను యాప్లో నమోదు చేస్తున్నారు.

పేటలో సర్వే చేపడుతున్న వెల్ఫేర్ అసిస్టెంట్ భరత్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులో శనివారం నిర్వహించిన రా కదలిరా సభకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అరకు, పాడేరు నియోజకవర్గానికి చెందిన వైసిపి పార్టీకి చెందిన 18 మంది సర్పంచులు, ఎంపీటీసీలు చంద్ర బాబు సమక్షంలో టీడీపీ పార్టీలో చేరారు. వారికి చంద్రబాబు టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు.

మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ తనయుడు మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహంకు టికెట్ రాలేదని ఆగ్రహంతో ఆయన వర్గీయులు టిడిపి జెండాలను కాలుతో తొక్కుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్టీ కోసం కష్టపడి జెండా మోసి పనిచేశారని తెలిపారు.

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఎ.ఎల్.పురం హైస్కూల్లో 1973-1976 వరకు చదువుకున్న పదవ తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో శనివారం నిర్వహించారు. ఎక్కడెక్కడో ఉద్యోగాల్లో స్థిరపడి మొదటిసారిగా 48ఏళ్ళ తం పూర్వ విద్యార్థులు కలుసుకుని చిన్ననాటి మధుర అనుభవాలు, కష్ట సుఖాలను ముచ్చటించుకున్నారు. అనంతరం వనభోజనాలు చేసి ఆటపాటలతో ఆనందంగా ఉత్సాహంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు పోతల శ్రీరామ్మూర్తి, ఎల్వి రమణ, రేముల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గెలుపొందిన జట్టు

పాత సంతబయలు జట్టు విజయం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఆడుదాం-ఆంధ్రా మండ ల స్థాయి క్రికెట్ పోటీలలో మున్సిపాలిటీకి చెందిన పాత సంత బయలు జట్టు విజయం సాధించింది. 26 సచివాలయాల పరిధిలోని క్రికెట్ జట్లు పోటీలో పాల్గొన్నాయి పురపాలక సంఘంలోని పాత సంతబయలు జట్టు విజయం సాధించిందని వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ నాయుడు తెలియజేశారు. బాలికల జూనియర్ కళాశాల మైదానంలో ఈ జట్ల మధ్య జరిగిన పోటీలో 44 పరుగుల ఆధిక్యంతో పాతసంత బయలు జట్టు విజయం సాధించింది. విజేతలను ఎంపీడీఓ జయమాధవి అభినందించారు.

కొమిరలో గుహలు అవాస్తవం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కొమిర సచివాలయం భవనం సమీపంలో భారీ గుహలు ఉన్నట్లు పలు వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల మేరకు భారీ బందోబస్తును స్థానిక ఎస్సై ఉమామహేశ్వరరావు ఏర్పాటు చేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా భూగర్భ జల శాస్త్రవేత్తలు వెంకట్రావు, శ్రీనివాసరావు, మల్లికార్జున రావు ఈ గుహలను శనివారం పరిశీలించారు. గుహలు ఏమి లేవని, వాటిని జెసిబి సహాయంతో పూర్తిగా తవ్వి పూడ్చి వేస్తే సరిపోతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు విశాల మద్దతు

-ఎక్కడికక్కడ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకోలు, ప్రదర్శనలు
-సమస్యలను పరిష్కరించాల్సిందేనని డిమాండ్

నక్కపల్లిలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు సమ్మెను శనివారం కొనసాగించారు. జిల్లాల్లోని పలు మండలాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తోరోకోలు, ర్యాలీలు చేపట్టారు.

విశాఖ కలెక్టరేట్ : అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు వై.కొండయ్య మాట్లాడారు. 40 రోజుల నుంచి అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, వై.రాజు, కె.పెంటారావు, ఒ.అప్పారావు, మూర్తి, జెఆర్.నాయుడు, ఎఐటియుసి నాయకులు ఎం.మన్మధరావు, ఎస్‌కె.రెహమాన్, కాసుబాబు, ఐఎఫ్‌టియు నాయకులు లక్ష్మి, తిరుపతిరావు, వెంకటలక్ష్మి, యువజన సంఘం నాయకులు యుఎస్‌ఎన్.రాజు, సంతోష్, ఐద్వా నాయకులు బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, కె.కుమారి, మణిలతో పాటు బాబ్జీ, మూర్తి, సింహాచలం, చంటి, నరసింగరావు, ప్రభావతి పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి ఓటమి తప్పదు

అంగన్‌వాడీల డిమాండ్లను సిఎం జగన్ నెరవేర్చకుంటే రానున్న ఎన్నికల్లో ఆయనకు ఓటమి తప్పదని పబ్లిక్ సెక్టార్ కో - ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తగరపువలస: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన తగరపువలస ప్రైవేట్ మార్కెట్ వద్ద శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ, అంగన్‌వాడీలు 40 రోజులుగా పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు, ఐద్వా జోన్ కార్యదర్శి కె.నాగరాణి, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు ఎస్.శ్రీనివాసవర్మ, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్, రాజేష్, ఆటో, ముఠా సంఘాల ప్రతినిధులు నీలాతి రాము, రీసు నరసింగరావు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు. రాస్తారోకోకు ముందుగా స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి కార్మికవాడ జంక్షన్ మీదుగా మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పెందుర్తి : అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన పెందుర్తిలో అంబేద్కర్ విగ్రహం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ, అనంతరం రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలనే అంగన్‌వాడీలు అమలు చేయమని అడుగుతుంటే తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.శంకరరావు, నూకరాజు, తిరుపతిరావు, స్టీల్‌ప్లాంట్ నాయకులు భానుమూర్తి, పిఒడబ్ల్యు నాయకులు నిర్మల, ఐద్వా నాయకులు అనంతలక్ష్మి, రజిని, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దేవి, బృంద, సూర్యకళ, సరస్వతి, జయ, సోమేశ్వరి, వేణు, జగ్గయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో చేపడుతున్న రాస్తారోకో

గాజువాక : పాత గాజువాకలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐద్వా ఆధ్వర్యాన రాస్తారోకో చేశారు. పాత గాజువాక నుంచి శ్రీ కన్య థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెఎం.శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, యు.రామస్వామి, శ్రీనివాసరాజు, ఎ.లోకేశ్వరరావు, పాల అప్పలరెడ్డి, ఎం.రమణ, నమ్మి రమణ, రాజేంద్రప్రసాద్, ఎన్.రామారావు, కొవిరి అప్పలరాజు, అవతారం, రాజు, ఎఐటియుసి నాయకులు వై.శ్రీనివాసరావు, బి.వెంకట్రావు, ఐద్వా నాయకులు కె.సంతోషం, ఎం.శ్రీదేవి, లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త అమ్మనమ్మ, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం.శశికుమార్, ప్రజానాట్య మండలి నాయకులు పివై.రమణారావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో...

సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో నిరసన

భీమునిపట్నం: సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. శనివారం రాత్రి 7 గంటల వరకు నిరసన కొనసాగించారు. ఐసిడిఎస్ భవనం ముందుభాగంలో విద్యుత్ దీపం లేకపోవడంతో సెల్ ఫోన్ లైట్ల వెలుగులో నిరసన తెలిపారు.

అనకాపల్లి : అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన శనివారం అనకాపల్లి పట్టణంలో ప్రదర్శన చేసి, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీలను రాష్ట్ర ప్రభుత్వం చులకనగా చూస్తుందని, 40 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, రాజాన దొరబాబు (ఏఐటీయూసీ), ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు (సిఐటియు), అర్.అప్పలరాజు, కె.శంకర్రావు, సత్యనారాయణ (రైతు సంఘం), సిహెచ్.శివాజీ, పి.చలపతి, ఏ.రాజు (డివైఎఫ్ఐ), తనూజ, కృష్ణవేణి(అంగన్వాడీ యూనియన్), బొమ్మాల రాము, అజయ్, నూకరాజు (మునిసిపల్ వర్కర్స్ ఫెడరేషన్), భీసెట్టి అప్పారావు, బి.రాజు, సురేష్ (ముఠా వర్కర్స్ యూనియన్) పాల్గొన్నారు.

మునగపాక : అంగన్వాడీలు సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యాన స్థానిక బైపాస్ సెంటర్లో భారీ రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ బ్రహ్మాజీ, వివి శ్రీనివాసరావు, గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, లోవేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు రామలక్ష్మి, అంజలి, తులసి లక్ష్మి, ఉమ, సరస్వతి, మంగ తల్లి పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి, మూడు రోడ్ల కోడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయిన బాబు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు పి భవాని, అమ్మాజీ, ప్రజా సంఘాల నాయకులు ఎర్ర దేవుడు, సిపిఐ నాయకులు వేచలపు కాసుబాబు, దేవుళ్ళు, కెవిపిఎస్ నాయకులు గాడి ప్రసాదు అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు.

40వ రోజుకు అంగన్వాడీల దీక్షలు

పరవాడ : అంగన్వాడీల సమ్మెలో భాగంగా పరవాడ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కొనసాగించారు. వీరికి ఉపాధ్యాయ సంఘం నాయకులు కే గంగాధర్, ఐద్వా నాయకురాలు పి.మాణిక్యం మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ నాయకులు ఎం.రమణి, సిహెచ్ దేవి, జి అమ్మాజీ, నీలిమ, పార్వతి, సుజాత, కుమారి, రత్నమాల, నాగమణి పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రంలో అంగన్వాడీల రిలే దీక్షలు 40వ రోజు కొనసాగాయి. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివి.రమణమ్మ, ఎం.వరలక్ష్మి, డి.పుష్ప, ఎస్.జగదీశ్వరి, ఆర్.శివరామ లక్ష్మీ, వి.సుభాషిణి, ఎం.కనకమ్మ, జి.అరుణ కుమారి, ఎస్. రమణమ్మ, డి.భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుటు అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన 40వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడు నాయుడు, ఐద్వా జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, యూనియన్ నాయకులు మంగ, సుజాత, లక్ష్మి, నూక రత్నం, సంతోషి, రమణమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు 40 అంకె ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆది వరలక్ష్మి, ఎలిసెట్ట అమ్మాజీ, చిలకమ్మ వెంకటలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శిబిరాన్ని సందర్శించి సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు.

నక్కపల్లి: అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వ వైఖరిని మార్చుకొని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కే.లోకనాథం డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 40వ రోజుకు చేరింది. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు జీ.దేముడునాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం అప్పలరాజు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 40 రోజులుగా శాంతియుతంగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు బి.సుబ్బలక్ష్మి, కవిత, నూకరత్నం, లక్ష్మి రాజ్యం, తులసి, సత్యవేణి, లక్ష్మి, సీతారత్నం, వెంకటలక్ష్మి, భవాని పాల్గొన్నారు.

గొలుగొండ : అంగన్వాడీల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కారం చేయాలని సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. మండలంలో అంగన్వాడిలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు మంగ, భ్రమరాంబ, భవాని, సత్య తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు మాట్లాడుతూ, 40 రోజుల నుంచి కుటుంబాలను వదులుకొని రోడ్డుపై సమ్మెలో కూర్చున్నప్పటికీ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి, అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక అబీద్‌సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ,ప్రభుత్వ నిరంకుశ చర్యలుతో సమస్య జఠిలమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ టి.ఈశ్వరరావు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు యల్ గౌరి, ట్రెజరర్ కెవీ సూర్యప్రభ పాల్గొన్నారు.

బీమిలిలో సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో నిరసన

మాడుగుల: స్థానిక బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీల సమ్మె 40వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో మాడుగుల ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు ఆర్. రామలక్ష్మి, డి.పార్వతి, వి.దనలక్షి, ఇరట నరసింహమూర్తి, ఆయాలు పాల్గొన్నారు.

కోటవురట్ల: అంగన్వాడీల దీక్ష 40 రోజులకు చేరుకుంది. తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు నిరసన చేపట్టి నినాదాలు చేశారు. కనీస వేతనం చెల్లించాలని, లేనిపక్షంలో దీక్ష విరమించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.